సాక్షి
వనపర్తి
బుధవారం । 30 । ఆగస్టు । 2023



.. పోచమ్మ బోనాలు

జిల్లాలోని గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

వివరాలు 9లో ▸



అవార్డు కోసం ఆపసోపాలు

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే మున్సిపాలిటీల్లో కాకుండా గ్రామాల్లో చేపడుతున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /24.2

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కాస్త ఉక్కపోత తప్పదు. మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం



అమరచింత: ఇచ్చిన హామీలు అమలుచేస్తూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర గిడ్డంగులశాఖ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పుర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై దివ్యాంగులకు పింఛన్ పెంపు ప్రొసీడింగ్ పత్రాలు అందజేసి మాట్లాడారు. దివ్యాంగులకు నెలకు రూ.4,016 పింఛన్ అందించడం సంతోషకరమన్నారు. ఆసరా పింఛన్ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అండగా నిలిచిందని తెలిపారు. పుర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రాజకీయాలు పక్కనబెట్టి వార్డుల్లో అవసరమయ్యే పనులు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని.. కాల్వల ద్వారా గ్రామాల చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహ్మద్ ఖాజా, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పనితీరు ఆధారంగానే క్రమబద్ధీకరణ



పెబ్బేరు రూరల్: పనితీరు ఆధారంగానే జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ చేపడతామని అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతి రావు అన్నారు. మంగళవారం డీపీఓ సురేష్‌కుమార్‌తో కలిసి వనపర్తి మండలం పడమటితండా, వెంకటాపూర్, ఖాసీంనగర్, అప్పాయిపల్లి, నాగమ్మతండా గ్రామపంచాయతీల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు, ప్రదర్శన సూచిక, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా అవెన్యూ ప్లాంటేషన్, సెగ్రిగేషన్ షెడ్, నీటిట్యాంకులు, వైకుంఠధామాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో రోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేసి వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయనవెంట ఎంపీడీఓ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్‌పార్టీ లక్ష్యం



కొత్తకోట రూరల్: అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని.. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం పెద్దమందడి మండలం మోజర్లలో పార్టీ సీనియర్ నాయకుడు మొగిలి సత్యారెడ్డి అధ్యక్షతన మైనార్టీ, విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ కార్యకర్తలు, నాయకులు 100 రోజులు కష్టపడితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతి, వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాల గురించి వివరించాలని సూచించారు. పెంటన్నయాదవ్, పర్వతాలు, నారాయణ, వెంకటేష్, రవి, యాదన్న, చంద్రశేఖర్, త్రినాథ్, మన్యం, దివాకర్‌యాదవ్, రోహిత్, రాముడు, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు..

వనపర్తిటౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ సమీపంలో చేపడుతున్న దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా చిన్నారెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్ కాంగ్రెస్ ఎన్నికల హామీలో పొందుపరుస్తామన్నారు. అదేవిధంగా టీడీపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు బొద్దారెడ్డి, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఖదీర్, జి.శేఖర్, బాలవర్ధన్, సౌమ్యారాణి, ఉమామహేశ్వర్, వహీద్, అరుణ పాల్గొన్నారు.

కాంగి'రేసు'లో కసరత్తు

అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై తొలి దశ వడపోత షురూ

- ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలు.. 84 మంది దరఖాస్తు
- పీఈసీలో 5 సంక్లిష్ట సెగ్మెంట్లపై చర్చ.. ఇద్దరు, ముగ్గురు పేర్లు ఖరారు
- మరో 5నియోజకవర్గాలపై ఏకాభిప్రాయం.. తొలి జాబితాలో వారికే చోటు ?
- పెండింగ్‌లో జడ్చర్ల, నారాయణపేట, మహబూబ్‌నగర్, దేవరకద్ర
- వచ్చే నెల 2న మరోసారి పీఈసీ భేటీ.. 4న ఫైనల్.. అదేరోజు సీఈసీకి జాబితా



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ముగియగా.. ఉమ్మడి పాలమూరులోని 14 నియోజకవర్గాల నుంచి 84 మంది ఆశావహులు అర్జీలు పెట్టుకున్నారు. ఈ మేరకు తొలిదశ ప్రక్రియలో భాగంగా ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అభ్యర్థుల వడపోత కార్యక్రమం హైదరాబాద్‌లో మొదలైంది. నియోజకవర్గాల వారీగా దరఖాస్తులను పరిశీలించిన నేతలు ఓ దఫా చర్చించారు. వచ్చే నెల రెండో తేదీన మరోసారి భేటీ కానున్నట్లు తెలిసింది. అదే నెల నాలుగో తేదీన ఫైనల్ చేసి.. అదేరోజు సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి పంపనున్నట్లు ఓ ముఖ్య నేత వెల్లడించారు.

ఆ 5 నియోజకవర్గాలపై సుదీర్ఘ చర్చ

హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన పీఈసీ భేటీలో ఉమ్మడి జిల్లాలోని వనపర్తి, మక్తల్, గద్వాల, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలపై ముఖ్య నేతలు సుదీర్ఘంగా చర్చించారు. అందరి అభిప్రాయం మేరకు ఆయా సెగ్మెంట్ల నుంచి ఇద్దరు, ముగ్గురు చొప్పున అభ్యర్థుల పేర్లను తొలిదశలో ఖరారు చేసి.. సీఈసీకి పంపించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో వనపర్తి నుంచి మాజీ మంత్రి చిన్నారెడ్డి, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి, కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పేర్లు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అదేవిధంగా మక్తల్ నుంచి నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్.. గద్వాల నుంచి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య, రాజీవ్‌రెడ్డి.. నాగర్‌కర్నూల్ నుంచి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కొల్లాపూర్ నుంచి టీపీసీసీ సభ్యుడు చింతల జగదీశ్వర్‌రావు, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అధిక సంఖ్యలో దరఖాస్తులు..

షాద్‌నగర్ నుంచి అత్యధికంగా 11, గద్వాల, నాగర్‌కర్నూల్ నుంచి 10 మంది చొప్పున, మహబూబ్‌నగర్, మక్తల్ నుంచి ఏడు, కల్వకుర్తి, నారాయణపేట, కొల్లాపూర్ నుంచి ఆరు, అచ్చంపేట, జడ్చర్ల నుంచి ఐదు చొప్పున, దేవరకద్ర, వనపర్తి నుంచి నాలుగు చొప్పున, అలంపూర్ నుంచి రెండు దరఖాస్తులు వచ్చాయి. కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి ఒకరే దరఖాస్తు చేసినట్లు పీఈసీ జాబితా విడుదల చేసింది.

నాలుగు పెండింగ్..

మరోవైపు మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట నియోజకవర్గాలకు సంబంధించి పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. అభ్యర్థిత్వాల ఖరారుకు సంబంధించి నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడమే కారణంగా తెలుస్తోంది. మక్తల్ అభ్యర్థులకు సంబంధించిన చర్చలో నాయకుల మధ్య గరంగరంగా సంభాషణ సాగినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. త్వరలో పీఈసీ మళ్లీ భేటీ కానుండగా.. వచ్చే నెల నాలుగో తేదీలోపు తొలిదశ జాబితాను ఫైనల్ చేసి సీఈసీకి పంపించేలా టీపీసీసీ నేతలు ముందుకు సాగుతున్నారు. వచ్చే నెల రెండో వారం చివర వరకు అభ్యర్థిత్వాల ఖరారు ఫైనల్ కానున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సీడబ్ల్యూసీ ఆమోదం పొందిన తర్వాత మూడో వారం మొదట్లో ఫైనల్ జాబితా విడుదలకానున్నట్లు అంచనా వేస్తున్నారు.

షాద్‌నగర్, మరో 4 సెగ్మెంట్లపై ఏకాభిప్రాయం

అభ్యర్థులు ఎక్కువ ఉన్నారంటే ఆ నియోజకవర్గంలో ఎవరికీ పెద్ద పట్టు లేదనే చర్చ పీఈసీలో జరిగినట్లు తెలిసింది. షాద్‌నగర్ నుంచి అత్యధికంగా 11 మంది, గద్వాల, నాగర్‌కర్నూల్ నుంచి 10 మంది ఆశావహులు పోటీపడుతుండడంపై లోతుగా విశ్లేషించినట్లు సమాచారం. ఈ క్రమంలో షాద్‌నగర్‌తో పాటు కిరికిరి లేని స్థానాలు కల్వకుర్తి, అచ్చంపేట, అలంపూర్, కొడంగల్ అభ్యర్థులపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వినికిడి. కల్వకుర్తి నుంచి సీడబ్ల్యూసీ ఆహ్వానిత సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, అచ్చంపేట నుంచి నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణ, షాద్‌నగర్ నుంచి ఈర్లపల్లి శంకర్, కొడంగల్ నుంచి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, అలంపూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పేర్లు ఫైనల్ చేసి సీఈసీకి పంపించాలని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ



శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్లలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ఆనంద్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: సమాజంలో జరుగుతున్న దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఆనంద్‌రెడ్డి అన్నారు. ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆదేశాల మేరకు మంగళవారం పెబ్బేరులోని కోతారినగర్, రామాలయం, వనపర్తిరోడ్ వీధుల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 58 బైక్‌లు, ఆటో, కారును సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని, దాతలు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని.. కేసులు ఉన్నవారు రాజీ అయ్యేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూర్, కొత్తకోట సీఐలు, 8 ఎస్‌ఐలు, 60 పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి..

పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ ఆనంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల విచారణలో పారదర్శకత పాటించాలని సిబ్బందికి సూచించారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఓటు హక్కును వదులుకోవద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్.. హాజరైన విద్యార్థులు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తిటౌన్: రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు ఒకటని.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వదులుకోకుండా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఓటుహక్కుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటే సుపరిపాలన అందించే ప్రభుత్వాలను ఎన్నుకోవడం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ఇంటి నుంచి కదల్లేని స్థితిలో ఉన్న దివ్యాంగులు ఉన్న చోటే ఓటు వినియోగించుకునే వెసులుబాటు సీఈసీ కల్పించనుందని తెలిపారు. దివ్యాంగులు పీడబ్ల్యూడీ ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని.. నాణ్యమైన విద్యతోనే పరివర్తన గల సమ సమాజ నిర్మాణం రూపుదిద్దుకుంటుందని వివరించారు. సమసమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత కీలక భూమిక పోషించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు కలెక్టర్ తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనాసక్తి !

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో చేరేందుకు ఆసక్తి చూపని పీయూ సిబ్బంది
- 2016 తర్వాత విధుల్లో చేరిన వారిని సమావేశానికి పిలిచిన అధికారులు
- 2014 కంటే ముందు వారు హాజరుకాని వైనం
- రెండ్రోజుల్లో నిర్ణయం తెలపాలని సూచించిన అధికారులు



నాన్‌టీచింగ్ సిబ్బందితో సమావేశమైన రిజిస్ట్రార్, ఓఎస్డీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న సిబ్బందిని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఏజెన్సీలకు అప్పగించే అంశంపై ఏకాభిప్రాయం కుదిరే పరిస్థితి కనిపించడం లేదు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో సిబ్బందిని ఔట్ సోర్సింగ్‌కు అప్పగిస్తారన్న వార్తలు రావడంతో సిబ్బందిలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. ఈ విషయమై మంగళవారం సాయంత్రం యూనివర్సిటీ రిజిస్ట్రార్ గిరిజ, వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 2016 తర్వాత విధుల్లో చేరిన వారిని మాత్రమే ఆహ్వానించడంతో యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు ఓయూ పరిధిలో పనిచేస్తున్న వారు ఒక్కరు కూడా హాజరుకాలేదు. ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో చేరిన వారికి చేకూరే ప్రయోజనాలపై సమావేశంలో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో సిబ్బంది గందరగోళానికి గురవుతున్నారు.

నిర్ణయానికి రెండ్రోజుల గడువు..

మంగళవారం జరిగిన సమావేశానికి 30 నుంచి 35 సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో చేరాలనుకునే సిబ్బంది వారి నిర్ణయాన్ని రెండ్రోజుల్లో రాతపూర్వకంగా తెలియజేయాలని అధికారులు వివరించారు. లేని వారిని యూనివర్సిటీ పరిధిలోనే కొనసాగిస్తామని.. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు తాము బాధ్యులం కామని సూచించారు. ఏజెన్సీలో చేరితే ఉద్యోగ భద్రత, వేతనాలు పెంపు ఉంటుందా? లేదా ? అనే అంశంపై సిబ్బందికి స్పష్టత లేదు. అయితే సిబ్బందే సంఘంగా ఏర్పడి ఆ సంఘం ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తామని కూడా అధికారులు సూచించినట్లు తెలుస్తోంది.

రెండు వర్గాలుగా చీలిన సిబ్బంది..

పీయూలో 135 మంది సిబ్బంది ఉండగా.. ఇందులో 2014 తర్వాత విధుల్లో చేరిన వారు 45 మంది.. పీయూ ఏర్పాటు కాకముందు చేరిన వారు 90 మంది ఉంటారు. వీరు రెండు వర్గాలుగా చీలిపోయారు. 2016 తర్వాత విధుల్లో చేరిన వారి సంఖ్య తక్కువగా ఉండటంతో వారు ఔట్‌సోర్సింగ్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. 2014 కంటే ముందు చేరిన వారు దీన్ని తిరస్కరిస్తున్నారు. సీనియారీ., ఉద్యోగభద్రత, వేతనాలు తదితర విషయాల్లో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు అందరినీ పిలవకుండా ఏకపక్షంగా సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకుంటే సీనియర్ సిబ్బందికి రేపు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న అంబుడ్స్‌మెన్ జిల్లా అధికారి సత్యనారాయణరెడ్డి

పాన్‌గల్: పంచాయతీ కార్యదర్శులు వారికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ జిల్లా అధికారి సత్యానారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గృహలక్ష్మి, కులవృత్తుల వారికి రూ.లక్ష సాయానికి అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. కొత్త గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను పరిశీలిస్తూ త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంక్షేమ పథకాల అమలులో వివక్ష లేకుండా అర్హులకు అందేలా చూడాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం'

పాన్‌గల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండలస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతూ పేదలపై భారం మోపుతోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లోనే నడుస్తోందని.. ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాలు, మూడెకరాల భూ పంపిణీ వంటి హామీలు విస్మరించిందన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి కుదింపునకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు, సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు గ్రామ గ్రామాన నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్, మండల కార్యదర్శి దేవేందర్, వెంకటయ్య, భగత్, భీమయ్య, నరేందర్, కృష్ణయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

అరగంట ఆటలతో ఆరోగ్యం

జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి



సీనియర్ పీడీలను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తిటౌన్: విద్యార్థులు రోజు అరగంట పాటు తమకు నచ్చిన ఆటలు ఆడటం, వ్యాయామం చేయడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో మైదాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతాయన్నారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ భాగస్వాములయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. అనంతరం సీనియర్ పీడీలు దామోదర్‌రెడ్డి, గోపి, ఇస్మాయిల్, ఎర్నెస్ట్, విజయ్‌ను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, డీఐఈఓ జాకీర్ హుస్సేన్, కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'రాఖీ' ఆదాయంపై ఆర్టీసీ దృష్టి



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లోని ప్రయాణికులు

- పండుగ కోసం 110 ప్రత్యేక బస్సులు
- మహిళలకు 30, 31 తేదీల్లో ప్రత్యేక లక్కీడ్రా బాక్స్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండుగ ఆదాయంపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఏడాది ఈ రెండు, మూడు రోజులు ప్రయాణికుల రద్దీ మేరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. గతేడాది ఆగస్టు 12వ తేదీన రాఖీ పండుగ రోజు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ రూ.1,81,46,707 ఆదాయాన్ని ఆర్జించింది. 92.42 ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో 3,34,573 కిలోమీటర్లు బస్సులు నడవగా ఈ ఆదాయం వచ్చింది. అప్పట్లో రోజు వారీ ఆదాయంలో ఇదే రికార్డు. డిపోల పరంగా మహబూబ్‌నగర్ డిపో రూ.25,76,155, వనపర్తి డిపో రూ.23,50,429, కల్వకుర్తి డిపో రూ.22,69,628ల అధిక ఆదాయాన్ని పొందాయి. ఈ సారి బుధవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు రీజియన్ పరిధిలో 110 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. రాఖీ పండుగ రోజు రద్దీని బట్టి మరో 40 బస్సులను నడపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు.

- రాఖీ సందర్భంగా ఈనెల 30, 31 తేదీల్లో మహిళా ప్రయాణికుల కోసం లక్కీడ్రా బాక్స్ నిర్వహిస్తున్నారు. రీజియన్‌లోని మహబూబ్‌నగర్, అచ్చంపేట, గద్వాల, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, షాద్‌నగర్, వనపర్తి బస్టాండ్లలో ప్రత్యేక లక్కీబాక్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలు తమ ప్రయాణ టికెట్లపై పేరు, మొబైల్ రాసి బాక్స్‌లో వేయాలి. అనంతరం లక్కీడ్రా తీసి బస్టాండ్ల వారీగా ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

డిపోల వారీగా ప్రత్యేక బస్సులు ఇలా..

డిపో	బస్సులు
మహబూబ్‌నగర్	17
వనపర్తి	17
అచ్చంపేట	11
నారాయణపేట	12
నాగర్‌కర్నూల్	9
కల్వకుర్తి	11
గద్వాల	11
షాద్‌నగర్	11
కొల్లాపూర్	11



ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రయాణికుల సౌకర్యార్థం రాఖీ పండగను పురస్కరించుకొని రీజియన్ పరిధిలోని డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మహిళా ప్రయాణికుల కోసం రెండు రోజుల పాటు ప్రత్యేక లక్కీడిప్ బాక్స్‌లు ఏర్పాటు చేశాం. మహిళలు తమ ప్రయాణ టికెట్లను బాక్స్‌లో వేయాలి. లక్కీడ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేస్తాం.

– వి.శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్







బొటానికల్ గార్డెన్‌లో రాఖీ పుష్పాలు

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో రాఖీ పుష్పాలు వికసించాయి. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆప్యాయతకు నిదర్శనంగా నిలిచే రక్షాబంధన్ ప్రతి శ్రావణమాసం పౌర్ణమి రోజున జరుపుకోవటం పూర్వకాలం నుంచి వస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా రాఖీల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ ప్రకృతి ప్రసాదించే పుష్పాలు మాత్రం ఎప్పటిలాగే వికసిస్తూ.. పలువురిని ఆకట్టుకుంటున్నాయి. రాఖీ పూలను కొందరు ఇళ్లల్లోనూ పెంచి రక్షాబంధన్ రోజున తమ సోదరులకు వాటిని కట్టడం చేస్తుంటారు. స్థానిక బొటానికల్ గార్డెన్‌లోనూ కొన్ని రాఖీ పుష్పాలు వికసించాయి. మంగళవారం ఉదయం వికసించి సాయంత్రానికి అవి ముడుచుకుపోతున్నాయి.

– జడ్చర్ల టౌన్

క్లుప్తంగా

చెరువులో పడి వృద్ధుడు మృత్యువాత

నాగర్‌కర్నూల్ క్రైం: స్నానం చేసేందుకు చెరువులోకి దిగిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం మేరకు.. అచ్చంపేటకు చెందిన వహీద్ (60) వారం క్రితం జిల్లాకేంద్రంలోని తన కుమార్తె వద్దకు వచ్చాడు. సోమవారం ఉదయం కిరాణం దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెదికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం సమీపంలోని కేసరి సముద్రం చెరువులో మృతదేహం కనిపించడంతో గుర్తించిన పుర సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి వహీద్‌గా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పాముకాటుతో మహిళ మృతి

మక్తల్: పాముకాటుకు గురై మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికురాలు సువర్ణ(33) సంగంబండ ఆర్‌ఆర్ సెంటర్‌లో గ్రామ పంచాయతీ నూతన భవనం నిర్మాణ పనులు చేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఉదయం 11 గంటలకు ఇటుకలను తీస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. దీంతో స్థానికంగా ఉన్నవారు వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో గుడిగండ్ల వద్దకు వచ్చేసరికి మృతిచెందింది. ఘటనపై ఆమె భర్త తిమ్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

యజమాని దాడిలో ట్రాక్టర్ డ్రైవర్..

నాగర్‌కర్నూల్ క్రైం: ట్రాక్టర్ ఓనర్ దాడి చేయడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం ప్రకారం.. తెల్కపల్లి మండలం పెద్దపల్లికి చెందిన పరుశరాములు (42) గట్టు నెల్లికుదురుకి చెందిన భాస్కర్ గౌడ్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యపిల్లలతో కలిసి జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కాగా ట్రాక్టర్‌ను దాసర్లపల్లి వద్ద వదిలిరావడంతో మంగళవారం జిల్లాకేంద్రంలోని పరుశరాములు ఇంటికి వచ్చిన ఓనర్ భాస్కర్ గౌడ్ అతడితో ఘర్షణ పడ్డాడు. ఘటనలో పరుశరాములు సొమ్మసిల్లి కిందపడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై రైతు..

ఊర్కొండ: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని గుడిగాన్‌పల్లిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గుండూరు వెంకటయ్య(45) తన వ్యవసాయ పొలంలో బోరు చెడిపోవడంతో మరమ్మతు చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. గమనించిన చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య



ఆత్మకూర్: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆత్మకూర్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ కథనం ప్రకారం.. జూరాలకి చెందిన తోట నవీన్‌కుమార్ (27) కడుపునొప్పి భరించలేక ఈనెల 24న తన వ్యవసాయ పొలం వద్ద మధ్యాహ్నం 2 గంటల సమయంలో పురుగు మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని పోలీసులు తెలిపారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహిస్తారని వివరించారు. నవీన్‌కు భార్యతో పాటు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బాలికలు అదృశ్యం

తెలకపల్లి: మండల పరిధిలోని గౌరారానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకల రాజుకు ఇద్దరు కుమార్తెలు మేకల భాగ్యమ్మ(16), మేకల మైనావతి(13) ఈ నెల 20న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ సుధీర్ కుమార్ తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ

- సేంద్రియ పద్ధతిలో రాఖీల తయారీ
- వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టిన అప్పంపల్లి విద్యార్థులు

దేవరకద్ర రూరల్: అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి, అనురాగానికి అద్దం పట్టె అపురూపమైన వేడుక రక్షాబంధన్.

తమకు ప్రాణ సమానమైన సోదరులు ఎల్లప్పుడు సంతోషకరంగా ఉంటూ, ఎలాంటి సమయంలోనైనా తమకు రక్షణగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఆప్యాయంగా సోదరిమణులు తమ సోదరులకు కట్టేది రాఖీ. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో పౌర్ణమి రోజున నిర్వహించే ఈ పండుగకు అనేక కథలు, పౌరాణిక గాథలు చాలానే ఉన్నప్పటికీ, తరాలు మారే కొద్ది కొత్త ఆలోచనలు అందిపుచ్చుకుంటూ సృజనాత్మక జోడిస్తున్నారు. అందులో భాగంగానే ఇది కేవలం అన్నాచెల్లెళ్ల బంధం మాత్రమే కాదని, పర్యావరణంపై మనకు బాధ్యత తెలియజేసే అవశ్యకత ఉందంటూ మహబూబ్‌నగర్ జిల్లా కొకుంట్ల మండలం అప్పంపల్లికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు.



తయారు చేసిన రాఖీలతో విద్యార్థులు



విద్యార్థులతో రాఖాలను తయారు చేయిస్తున్న క్రాఫ్ట్ టీచర్



మునగ విత్తనాలతో తయారు చేసిన రాఖీలు

పర్యావరణానికి మేలు చేసేలా..

మార్కెట్లో దొరికే ప్లాస్టిక్ రాఖీలతో డబ్బులు వృథాగా పోవడమే కాకుండా వాటి తయారీలో వాడే సిల్క్ దారాలు, రంగురాళ్లతో పాటు ప్లాస్టిక్ పదార్థాలతో తయారయ్యేవి భూమిలో కలవకుండా అనేక టన్నుల కార్బన్ పదార్థాలను విడుదల చేస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి. అందుకు భిన్నంగా పర్యావరణహితమైన రాఖీలను ఈ పాఠశాల విద్యార్థులు తయారుచేశారు. అందుకోసం పాఠశాల ఉపాధ్యాయులు గుముడాల చక్రవర్తి గౌడ్, శ్రీనివాసులు, సుశీల, క్రాఫ్ట్ టీచర్ కవిత సహకారం తీసుకున్నారు. కొకుంట్లకు చెందిన రైతు ఏశమోని రాములు ద్వారా మునగ విత్తనాలను సేకరించారు. కాగితంతో పాటు దారాలతో తయారు చేసిన రాఖీలపై ఈ మునగ విత్తనాలను అంటించి సరికొత్తవి తయారు చేస్తున్నారు. వీటితో పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. అలాగే రాఖీ కట్టిన తర్వాత చివరలో మిగిలిన ఈ విత్తనాన్ని తమ సోదరులు తమ గుర్తుగా భూమిలో నాటితే వాటి ద్వారా మొక్కలు వస్తాయి. రాఖీ కట్టిన సోదరీమణులకు అండగా ఉండి అన్న ఎలా రక్షిస్తాడో భూమిలో విత్తనాన్ని కూడా అలాగే కాపాడుకుంటామని విద్యార్థులు అంటున్నారు.

ఆసక్తిగా నేర్చుకున్నాం..



ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న రాఖీల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని ఉపాధ్యాయులు మాకు వివరించారు. అలా కాకుండా సేంద్రియ పద్ధతిలో రాఖీలు తయారు చేసే విధానం, వాటి వినియోగం వల్ల కలిగే లాభాలను వివరించడంతో మా స్నేహితులందరం ఆసక్తిగా నేర్చుకున్నాం.

– స్వప్న, ఆరో తరగతి

అందరికి వివరిస్తా..



సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన రాఖీల ద్వారా కలిగే లాభాలను అందరికి వివరిస్తాను. వీటి వినియోగం తర్వాత, నాటిన విత్తనం ద్వారా మొలకెత్తే మొక్కలను జాగ్రత్తగా పెంచుకుంటాం. భవిష్యత్‌లోనూ స్నేహితులమందరం సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన రాఖీలను వాడుతూ పర్యవరణ పరిరక్షణకై మా వంతు ప్రయత్నం చేస్తాం.

–రష్మిత, ఏడో తరగతి

పర్యావరణంపై బాధ్యత..



ప్రస్తుతం పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంతో భవిష్యత్ తరాలకు తీవ్ర ముప్పు పొంచి ఉంది. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా పర్యావరణానికి మేలు చేసే పనులపై విద్యార్థులకు ఆసక్తిని పెంచాలని నిర్ణయించుకున్నాం. పర్యావరణ రహిత రాఖీలను విద్యార్థుల చేత తయారు చేయించాం. పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులకు సేంద్రియ పంటపై అవగాహన కల్పించాం. తొలి ప్రయత్నంగా వంద రాఖీల వరకు తయారు చేశాం. విద్యార్థులు వారి స్నేహితులకు కూడా వీటి గురించి వివరిస్తారు. పాఠశాల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలతో పాటు ఆకు కూరలను సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నాం.

– గుముడాల చక్రవర్తిగౌడ్, ఉపాధ్యాయుడు, అప్పంపల్లి

అర కిలో బంగారం మాయం

- మణప్పురంలో నగలు తాకట్టు పెట్టిన బాధితులు
- రుణం డబ్బులు చెల్లిస్తామన్నా.. నగలు ఇవ్వకుండా దాటవేత
- నాలుగు నెలలుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

మహబూబ్‌నగర్ క్రైం: తక్కువ వడ్డీ పేరుతో గోల్డ్ లోన్ ఇస్తామని చెబుతూ.. బాధితుల బంగారం మాయం చేసిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటు చేసుకుంది. జిల్లాకేంద్రానికి చెందిన శరత్ చంద్రరెడ్డి, చంద్రశేఖర్ నాలుగు నెలల కిందట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉన్న మణప్పురం గోల్డ్‌లోన్ సంస్థలో 500 గ్రాముల బంగారం కుదవపెట్టి రూ.20 లక్షల వరకు తీసుకున్నారు. ప్రతి నెల వడ్డీ చెల్లిస్తూ వస్తున్నారు. ఇటీవల వారు లోన్ తీసుకున్న డబ్బు తిరిగి చెల్లిస్తాం బంగారం అభరణాలు ఇవ్వాలని సంస్థ నిర్వాహకులను అడిగితే దాటవేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి ఆఫీస్ మణప్పురం కార్యాలయం చుట్టూ తిరిగినా.. లాభం లేకుండా పోయింది. దీంతో మంగళవారం మేనేజర్‌ను బాధితులు గట్టిగా నిలదీశారు. దీంతో గతంలో ఇక్కడ పనిచేసిన మేనేజర్ మీ బంగారం దొంగతనం చేశారని చెప్పినట్లు సమాచారం. దీంతో వారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వన్‌టౌన్ ఎస్‌ఐ నవీద్‌ను వివరణ కోరగా.. ఈ ఘటనపై ఏప్రిల్‌లోనే వన్‌టౌన్‌లో కేసు నమోదైందని, కోర్టు పరిధిలో ఉందని తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

జింకపిల్ల పోలీసులకు అప్పగింత



మరికల్: మండలంలోని జిన్నారం శివారులోని హనుమాన్ దేవాలయం సమీపంలో దొరికిన జింకపిల్లను రైతులు మంగళవారం పోలీసులకు అప్పగించారు. ఆత్మకూర్ రోడ్డు దాటుతుండగా కుక్కలు వెంబడించడంతో వాటి నుంచి రక్షించిన జింక పిల్లను రైతులు ఖాజా, తిరుపతయ్యగౌడ్ మరికల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు జింకపిల్లను అటవీ శాఖ అధికారులకు అందజేశారు.

మాచారంలో కుష్టు కేసు నమోదు

- బిహార్‌కు చెందిన వ్యక్తికి నిర్ధారణ పరీక్షలు
- గ్రామాన్ని సందర్శించిన రాష్ట్ర లెప్రసి అడిషనల్ డైరెక్టర్ రవీందర్ నాయక్

జడ్చర్ల టౌన్: మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న మాచారంలో లెప్రసి(కుష్టు) కేసు నమోదైంది. బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి కొంత కాలంగా బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చాడు. మాచారం సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ.. జీవిస్తున్నాడు. భార్య, కుటుంబ సభ్యులు బిహార్‌లోనే ఉంటున్నారు. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన లెప్రసి సర్వేలో భాగంగా మాచారంలోనూ ఆశకార్యకర్తలు సర్వే నిర్వహించారు. సర్వేలో ఇంటింటికీ తిరుగుతుండగా.. తనకు వంటిపై మచ్చలు ఉన్నాయని అతను సర్వే సిబ్బందికి తెలియజేశాడు. అతడి వివరాలు నమోదు చేసుకుని వైద్యాధికారి ద్వారా జిల్లా లెప్రసి అధికారులకు సమాచారం అందించారు. దీంతో జిల్లా లెప్రసి బృందం అతడికి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో లెప్రసిగా నిర్ధారణ అయ్యింది. ఆరు నెలల పాటు మందులు వాడాలని సూచిస్తూ.. మందులు అందజేశారు. లెప్రసి అంటు వ్యాధి కావటంతో ఇతరులకు సోకకుండా ఉండేందుకు గానూ మంగళవారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించారు.

గ్రామాన్ని సందర్శించిన లెప్రసి అడిషనల్ డైరెక్టర్..

లెప్రసి కేసు నమోదు కావటంతో మంగళవారం రాష్ట్ర లెప్రసి డైరెక్టర్ డా.రవీందర్‌నాయక్ గ్రామాన్ని సందర్శించారు. లెప్రసి సోకిన వ్యక్తిని కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న లెప్రసి సర్వేను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి గ్రామస్తులతో ముఖాముఖీ మాట్లాడారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కృష్ణ, జిల్లా లెప్రసి ప్రోగ్రాం అధికారి డా. జరీనాభాను, గంగాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శివకాంత్, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఓ సుభాష్, చంద్రబోస్, హనుమంతరావు తదితరులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ డా.రవీందర్‌నాయక్

రెచ్చిపోయిన ఇసుక మాఫియా

- సమాచారం ఇచ్చారని ఇంటికి వెళ్లి దాడి
- పోలీసుల ప్రమేయం ఉందని యువకుడి ఆరోపణ

రాజోళి: ఇసుక మాఫియా రెచ్చిపోయింది. తమ దందాకు సంబంధించిన సమాచారం ఇస్తున్నారనే నెపంతో యువకుడి ఇంటికి వెళ్లి భౌతికదాడులకు పాల్పడ్డారు. దానికి కారణం కూడా పోలీసులే అని చెబుతూ బాధితుడు దాడులకు సంబంధించిన వీడియోలు, సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాన్‌దొడ్డిలో కొద్ది రోజులుగా అక్రమ ఇసుక దందా కొనసాగుతుంది. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ఇసుక డంపులు కూడా పోశారని మాన్‌దొడ్డికి చెందిన యువకుడు రవి రాజోళి పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు మాత్రం వారిపై చర్యలు తీసుకోలేదని యువకుడు వాపోయాడు. గ్రామంలో ట్రాక్టర్లు పట్టుకునేందుకు వచ్చిన పోలీసులు సంబంధిత ఇసుక మాఫియాతో కలిసి తనకు ఫోన్ చేశారని, కానీ తాను వెళ్లలేదని చెప్పాడు. అనంతరం మళ్లీ రెండు రోజులకు ఎస్‌ఐ ఖాదర్ బాషకు సమాచారమిస్తే.. మేము వచ్చేలోగా ట్రాక్టర్లు వెళ్లిపోతున్నాయని, వాటికి అడ్డంగా పడుకో అని ఎస్‌ఐ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడని యువకుడు తెలియజేశాడు. వాటికి సంబంధించిన ఆడియో రికార్డును కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇంటికి వచ్చి మరీ వారు తనపై దాడి చేశారని, పోలీసులే ఈ దాడులు చేయించారని యువకుడు ఆరోపించాడు. ఇంటి వద్ద దివ్యాంగులు ఉండగా.. వారిని కూడా లెక్కచేయకుండా కిందకు తోసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్పీ, డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు యువకుడు తెలిపాడు. ఇసుక మాఫియాకు చెందిన కొందరితో ఆయన సంబంధాలు పెట్టుకుని మామూళ్లు వసూలు చేస్తున్నారని, రాజోళి, మాన్‌దొడ్డికి చెందిన వారి ద్వారా ఈ తతంగం కొనసాగుతుందని ఆరోపించారు.



యువకుడిపై దాడి చేస్తున్న ఇసుక మాఫియా

అన్ని అవాస్తవాలే...

మాకు అందిన సమాచారం మేరకు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశాం. ఆ యువకుడు ఫోన్ చేసిన ప్రతిసారి గ్రామంలోకి వెళ్లి పరిశీలించాం. అక్కడ ఎలాంటి ట్రాక్టర్లు లేకపోవడంతో వెనక్కు వచ్చాం. యువకుడిపై జరిగిన గొడవ విషయంలో వారికి వ్యక్తిగత తగాదాలున్నాయి. దాన్ని అడ్డుపెట్టుకుని నాపై అనవసర ఆరోపణలు చేస్తున్నారు.

– ఖాదర్ బాష, ఎస్‌ఐ

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే అరెస్ట్ చేయండి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీలకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

నాగర్‌కర్నూల్/కందనూలు: ప్రజాసామ్యన్ని అపహాస్యం చేసేలా కాంగ్రెస్ నాయకులపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేసి, వెంటనే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసులు గుండెపై చేయి వేసుకుని ఆలోచించాలని, రాజకీయంలో అధికారం శాశ్వతం కాదన్నారు. కొంతమంది పోలీసులు బీఆర్‌ఎస్ కార్యకర్త స్థాయిలో పనిచేస్తూ, అమాయక ప్రజలను హింసిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేలు తమ నోరును అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని మండిపడ్డారు. మీది 20 ఏళ్ల పార్టీ, మాది 139 ఏళ్ల పార్టీ, మేము చేసిన అభివృద్ధి మీరు తిరిగే గ్రామాల్లో చూస్తే కనిపిస్తుందన్నారు. ఎమ్మెల్యేలు బహిరంగ క్షమాపణలు చెప్పాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎమ్మెల్యేలపై కేసు నమోదు చేసి పోలీసులు తమ చిత్తశుద్ధి నిరుపించుకోవాలి, లేకుంటే మరో నాలుగురోజులు తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు..

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేల వీడియోలు, ఇతర సాక్ష్యాలతో కలెక్టర్ ఉదయ్ కుమార్, ఎస్పీ మనోహర్‌కు వేర్వేరుగా కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్థం రవి, పాండు, శ్రీనివాస్‌గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బాలానగర్: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ఎదుట జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అత్యంత వేగంతో ఓ వ్యక్తిని ఢీకొనడంతో గుర్తుపట్టలేనివిధంగా శరీరం మారింది. వాహనం అతివేగంతో ఢీకొనడంతో సుమారు 100 మీటర్ల దూరంలో ఎగిరిపడి దుర్మరణం చెందినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాల రాకపోకలకు వీలుగా చర్యలు చేపట్టి మృతదేహాన్ని షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

దమ్ము చేసేందుకు.. రోటోవేటర్ బెటర్



కేజ్‌వీల్స్‌తో దమ్ము చేయడం

అలంపూర్: వరి సాగులో అత్యంత ప్రధానమైనది భూమి దమ్ము చేయుట. వరి వేసే పొలంలో నీరు నిలబెట్టి బాగా దున్ని దాన్నే దమ్ము చేయడమని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. ఈ దమ్ము చేయడం సాధారణంగా కేజ్‌వీల్స్ సాయంతో చేస్తారు. అలా కాకుండా రోటోవేటర్ సాయంతో దమ్ము చేయడం చాలా లాభసాటిగా ఉంటుందని రైతులకు వివరించారు.

కేజ్‌వీల్స్.. రోటోవేటర్ వాడకంలో తేడాలు..

కేజ్‌వీల్స్‌తో దమ్ము చేయడంతో భూమిలో ఎక్కువ లోతు ఏర్పడుతుంది. దీంతో నీరు అధికంగా అవసరం అవుతుంది. వేరు వ్యవస్థ సాధారణంగా 20 నుంచి 30 సెంటీమీటర్ల లోతులోనే ఉంటుంది. కానీ కేజ్‌వీల్స్‌తో దమ్ము చేస్తే అడుగు కంటే లోతుకు వెళ్తుంది. దీంతో మొక్కకు పూర్తిస్థాయి పోషకాలు అందవు. రోటోవేటర్‌తో దమ్ము చేస్తే 20 నుంచి 25 సెంటీమీటర్ల కంటే ఎక్కువ లోతు కాదు. తక్కువ లోతు వరకే తడి అందాలి కాబట్టి నీరు తక్కువ అవసరం ఉంటుంది. వేరు వ్యవస్థ ఏర్పడే అంత వరకే లోతు ఉంటుంది. పోషకాలు నేరుగా మొక్కకు అందుతాయి. అంతేకాకుండా బెడ్ పద్ధతి ఏర్పడుతుంది. దీంతో మొక్క బలంగా తయారవడానికి భూమి దడలుగా మారుతుంది. కాబట్టి రోటోవేటర్ ద్వారా దమ్ము చేయడం లాభదాయకం. రోటోవేటర్‌తో దమ్ము చేయడంతో ట్రాక్టర్ ఇంజిన్‌పై భారంపడదు. డీజిల్ వినియోగం తగ్గుతుంది. ఈ కారణాల దృష్ట్యా కేజ్‌వీల్స్ వాడకాన్ని తగ్గించాలి. ఇంకా కేజ్ వీల్స్‌ను పొలానికి తీసుకొచ్చే సమయంలో తారు రోడ్లు పాడవుతాయి. కాబట్టి రైతులు కేజ్‌వీల్స్‌కు బదులుగా రోటోవేటర్‌ను వినియోగించాలని సూచించారు.

రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వ్యక్తిపై దాడి

జడ్చర్ల: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసేందుకు వచ్చిన ఒక వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటన మంగళవారం జడ్చర్లలో చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన బాధితుడు గోవిందరావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తన భార్య, కుమారుడు, మిత్రులతో కలిసి బాలానగర్ సమీపంలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కార్యాలయం ఎదుట ఉన్న బేకరీలో టీ తాగుతుండగా.. ఆకస్మికంగా దాదాపు పదిమంది దాకా చుట్టుముట్టి చితకబాదారు. ఎందుకు కొడుతున్నారో కారణం కూడా తెలియదు. దాడిలో తన మెడలోని మూడు తులాల చైన్, లాకెట్ కూడా లాక్కెల్లారని బాధితుడు వాపోయాడు. దాడిలో తనకు గాయాలయ్యాయని, తిరిగి వెళ్లేందుకు రైలు సమయం ఆసన్నం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయానని తెలిపాడు. త్వరలోనే జడ్చర్లకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కాగా జడ్చర్లలో పెట్రేగిపోతున్న భూ మాఫియానే దాడి చేసి ఉంటారని పలువురు భావిస్తున్నారు. బాధితుడు అధిక సంఖ్యలో ప్లాట్లను కొనుగోలు చేసి విక్రయిస్తున్న విషయంలో స్థానిక భూమాఫియా జోక్యం చేసుకుని దాడి చేసి ఉంటారని భావిస్తున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. దాడికి సంబంధించి తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ రమేష్ బాబు తెలియజేశారు.

నాణేనికి అటు.. ఢిల్లీలో డ్రామా!

ఎంపిక చేసుకున్న విలేకరుల సమావేశంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు

- తాను మొదటి నుంచీ కేంద్రంలో పొత్తులోనే ఉన్నాడట..
- హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చానంటూ మరోసారి నాలుక మడత
- హోదా ఏమైనా సంజీవనా?.. ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అర్ధరాత్రి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే ధీమా
- పోలవరం కాంట్రాక్టుల కోసం హోదాను తాకట్టు పెట్టిన ఘనత బాబుదే
- రామోజీ వియ్యంకుడు, యనమల వియ్యంకుడిని కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి దబ్బు దండుకున్న విషయం ఎవరూ మరువలేరు
- రాజధాని పేరుతో బాబు భారీ స్కామ్‌కు తెరతీయడంతో తీవ్ర ప్రజా వ్యతిరేకత
- దాన్ని కేంద్రంపైకి మళ్లించడం కోసం చివరి ఏడాది ఎన్డీఏ నుంచి బయటకు టీడీపీ
- 2019 ఎన్నికల్లో బెడిసికొట్టిన అంచనాలు.. బీజేపీలోకి కోవర్టులను ప్రవేశపెట్టిన బాబు
- తన పార్ట్‌నర్ పవన్‌ను కాషాయం ఫ్రంట్‌లో చేర్చి ఢిల్లీ కరుణ కోసం వేడుకోలు
- ఆ ప్రయత్నాలకు తోడు కొత్తగా పురందేశ్వరి కుటుంబంతో కుదిరిన రాజీని బీజేపీతో పొత్తు కోసం వాడుకుంటున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: పార్టీ భవిష్యత్‌పై ఆశలు ఆవిరవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలో కూరుకుపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తాజాగా బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో పెద్ద డ్రామానే నడిపారు! ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమాన్ని ఇందుకు వినియోగించుకున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తరువాత రెండో రోజు ఢిల్లీలో ఎంపిక చేసుకున్న విలేకరుల సమక్షంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు విసరడం చర్చనీయాంశమైంది. తాను మొదటి నుంచి కేంద్రంలో పొత్తులోనే ఉన్నానంటూ బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన ప్రయత్నించారు. ప్రత్యేక హోదా కోసమే గతంలో తాను ఎన్డీయే నుంచి బయటకు వచ్చానంటూ తాజాగా చంద్రబాబు మరోసారి నాలుక మడతేశారు. 'హోదా ఏమైనా సంజీవనా..? ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అధికారంలో ఉండగా అర్ధరాత్రి తాను ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే భ్రమతో తనకు అలవాటైన రీతిలో చంద్రబాబు అలవోకగా అబద్ధాలు చెప్పేశారు. పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టుల కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు తాకట్టు పెట్టిన విషయం జనం మది నుంచి చెదిరిపోలేదు. రామోజీరావు, యనమల రామకృష్ణుడు వియ్యంకులను కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి ప్రాజెక్టు సొమ్మును ఏటీఎంలా వాడుకుని డబ్బులు దండుకున్న విషయాన్ని ప్రజలెవరూ ఎప్పటికీ మరువలేరు! ఇవన్నీ ఎవరికీ గుర్తుండవనే ఉద్దేశంతో బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతూ చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడారు!

ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడేందుకు ఎన్డీఏ నుంచి బయటకు

చంద్రబాబు అధికారంలో ఉండగా రాజధాని అమరావతి పేరుతో భారీ అంతర్జాతీయ స్కామ్‌కు తెరతీయడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రాజధాని ముసుగులో ఆయన చేసిన అక్రమాలు బయటపడడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వెల్లి విరిసింది. దీన్ని కేంద్ర ప్రభుత్వంపై మళ్లించడం కోసం తన పాలన చివరి సంవత్సరంలో చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లుగా ఎన్నికల్లో ఆయన అంచనాలు బెడిసికొట్టి చిత్తుచిత్తుగా ఓడిపోయారు. వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే బీజేపీలోకి తన కోవర్టులను ప్రవేశపెట్టారు. తన మిత్రుడైన పవన్ కల్యాణ్‌ను సైతం కాషాయ ఫ్రంట్‌లో చేర్చారు. ఘోర ఓటమి తర్వాత మళ్లీ ఎలాగైనా బీజేపీ పంచన చేరడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఆ ప్రయత్నాలకు తోడు తాజాగా పురందేశ్వరితో రాజీ చేసుకుని బీజేపీతో పొత్తు అవసరాలకు వాడుకున్నారు. ఇటీవలే బీజేపీ అధ్యక్షురాలైన పురందేశ్వరి కుటుంబంతో చంద్రబాబుకు రాజీ కుదిరింది. బీజేపీలో ఉంటూ చంద్రబాబుకు సహకరించేందుకు పురందేశ్వరి అంగీకరించారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమం సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు బాబును దగ్గర చేసేందుకు ఆమె తాపత్రయపడ్డారు.

నాణెం విడుదల కార్యక్రమానికి సతీమణిని పిలవరా?

పురందేశ్వరి చంద్రబాబు ఏజెంటులా పనిచేస్తున్నారని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి ఆరోపించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమాన్ని ఆయన సతీమణిని పిలవకుండా నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్టీఆర్‌ను చివరి దశలో వంచించి వేధించిన కుటుంబ సభ్యులంతా ఇప్పుడు మరోసారి ఆయన భార్యను అవమానించారు. వేలమంది సమక్షంలో లక్ష్మీ పార్వతిని తన భార్యగా ఎన్టీఆర్ బహిరంగంగానే ప్రకటించిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఆమెను కార్యక్రమానికి రానివ్వకుండా గూడుపుఠాణి చేసి కేవలం చంద్రబాబుకు సన్నిహితులైన కుటుంబ సభ్యులు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యేలా చేశారు. ఇందులోయ ఎలాంటి గూడుపుఠాణి లేకపోతే లక్ష్మీపార్వతిని పిలవవచ్చు కదా? అనే ప్రశ్నకు సమాధానం లేదు.

ఆ వంకతో నడ్డాతో చంద్రబాబు భేటీ

ఇక ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమం వంకతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో చంద్రబాబు వంగి వంగి మంతనాలాడారు. ఈ భేటీలో టీడీపీ కోవర్టులు తప్ప మిగిలిన పాత బీజేపీ నేతలు ఎవరూ లేకపోవడం కొసమెరుపు. అక్కడ చంద్రబాబు తన పొత్తు ప్రతిపాదనలను నడ్డా ఎదుట పెట్టి ఎలాగైనా పొత్తు కుదిరేలా చూడాలని కోరారు. నడ్డా నుంచి ఆశించిన స్పందన వచ్చిందో లేదో తెలియదు గానీ రెండో రోజు చంద్రబాబు ఎంపిక చేసిన విలేకరుల కోసం లంచ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ మోదీ సర్కార్‌పై తన ప్రేమను చాటుకున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మంచి సంబంధాలు అవసరమని తాజాగా చంద్రబాబు ప్రవచించారు. చంద్రబాబు తాను సీఎంగా ఉండగా ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు నల్లజెండాలు ఎగరేయడం, నిరసన తెలియచేస్తూ హోర్డింగ్‌లు పెట్టడం, బీజేపీ అగ్రనేత అమిత్‌షా కారు మీద తిరుపతిలో రాళ్లతో దాడి చేయించిన విషయాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించటాన్ని నెటిజన్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. బీజేపీతో పొత్తు కోసం శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు మరోసారి ఎన్టీఆర్ పేరును ఉపయోగించుకున్నారు. ఎన్టీఆర్ స్మారక నాణెం కార్యక్రమాన్ని తన పొత్తు చర్చల కోసం వినియోగించుకుని మరోసారి ఆయనకు వెన్నుపోటు పొడిచారు.

నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువత సొంతం

ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్



పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువతకు ఉందని ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ సందేశం ఇస్తూ మానవాళి ప్రయోజనాలు పరిరక్షించే నూతన ఆవిష్కరణలకు యువత కృషిచేయాలని సూచించారు. చదువు, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నైతికత, సామాజిక బాధ్యత కూడా ముఖ్యమని చెప్పారు. యువత నేర్చుకునే సాంకేతిక, నైపుణ్యం కేవలం తమ సొంతానికి మాత్రమే కాకుండా సమాజ హితం కోసం వాడాలని సూచించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, సంక్షోభాలకు పరిష్కారం చూపే వైవిధ్యభరితమైన ఆవిష్కరణలు చేయడంతోపాటు వాటి ద్వారా అపారమైన అవకాశాలు సృష్టించాలని సూచించారు. యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఏఎన్‌యూ అభివృద్ధి నివేదికను సమర్పించారు. అనంతరం ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పలువురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలు అందించారు.

వ్యవసాయ రంగ సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఏపీ: సాయినాథ్

వ్యవసాయ రంగంలో సంక్షోభం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యలపై తాను 2001-2002 కాలంలో అధ్యయనం చేశానని చెప్పారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో వ్యవసాయ రంగ సంక్షోభంపై అధ్యయనానికి ప్రత్యేకంగా కమిటీని నియమించారని తెలిపారు. ఈ కమిటీ సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి నిశితంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు ప్రాంతాల్లో వ్యవసాయరంగ సమస్యలు, వాస్తవ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేశానని తెలిపారు. ఆ సేవలకు దక్కిన గౌరవంగా ఈ డాక్టరేట్‌ను భావిస్తానని సాయినాథ్ తెలిపారు.

సత్తా చాటుతున్న సహకార బ్యాంకులు

టెస్కాబ్ టర్నోవర్ రూ.19 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సహకార బ్యాంకులు లాభాల బాటపట్టాయి. గతంలో కంటే టర్నోవర్ లోనూ, లాభాల్లోనూ మేటిగా నిలబడ్డాయి. రైతులకు అధిక రుణాలిస్తూ ముందు వరుసలో ఉన్నాయి. ముఖ్యంగా డీసీసీబీలు, ప్యాక్స్‌లు క్షేత్రస్థాయిలో విభిన్న రంగాల్లో వ్యాపారాలు చేస్తూ లాభాలను గడిస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వార్షిక టర్నోవర్ భారీగా పెరిగింది. ఈ మేరకు మంగళవారం నివేదిక విడుదల చేసింది. 2015లో ఈ బ్యాంకు వార్షిక టర్నోవర్ కేవలం రూ. 6,307 కోట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఇది రూ. 19,021 కోట్లకు పెరిగింది. అంటే ఎనిమిదేళ్లలో టెస్కాబ్ టర్నోవర్ మూడు రెట్లు పెరగడం గమనార్హం. దీంతో పాటు లాభాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. 2015లో ఆ బ్యాంకు లాభాలు కేవలం రూ. 27.81 కోట్లు మాత్రమే కాగా, ప్రస్తుతం ఇది రూ. 133 కోట్లకు పెరిగింది. గతేడాది తొలిసారిగా రూ. 100 కోట్ల లాభాల మార్జిన్‌ను బ్యాంకు చేరుకుంది. టెస్కాబ్ ద్వారా రుణాల మంజూరు కూడా భారీగా పెరిగింది. 2015లో కేవలం రూ. 2,909 కోట్లు మాత్రమే రుణాలను అందించగా ప్రస్తుతం ఇది రూ. 8,508 కోట్లకు పెరిగింది. టెస్కాబ్, డీసీసీబీలు, ప్యాక్స్‌లు దేశంలో అనేక అవార్డులు సాధిస్తూ ప్రతిభ కనబరుస్తున్నాయి. దేశంలోని సహకార బ్యాంకుల్లో సాంకేతికత వినియోగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించింది. దీంతో పాటు సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్‌ను నెలకొల్పిన తొలి సహకార బ్యాంకులు కూడా తెలంగాణ సహకార బ్యాంకులే కావడం గమనార్హం. అదే విధంగా అన్ని ప్రాథమిక సహకార సంఘాల (ప్యాక్స్)ను కంప్యూటరైజేషన్ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 2018-19లో 798 ప్యాక్స్‌లు ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్య 825కి పెరిగింది.

ఉత్తమ సేవలు అందిస్తున్నాం..

రైతులకు, వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రైతులకు సరళ పద్ధతిలో రుణాలు మంజూరు చేస్తున్నాం. ప్యాక్స్‌ల ద్వారా ఇతర వ్యాపారాలు చేస్తూ వాటి లాభాలను మరింత పెంచాం. టెస్కాబ్, డీసీసీబీ, ప్యాక్స్ టర్నోవర్‌తో పాటు లాభాలు పెరిగాయి. ఇంకా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నాం.

– నేతి మురళీధర్‌రావు, ఎండీ, టెస్కాబ్



తిరుమల పవిత్రోత్సవాలు పరిపూర్ణం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం యాగశాలలో రుత్వికులు హోమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవితో కలిసి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



సమాంతర కాల్వ ద్వారా రామన్‌పాడుకు వస్తున్న నీరు

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు మంగళవారం ఎలాంటి ఇన్‌ఫ్లోలు రావడం లేదని పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో ఉన్న నిల్వ నీటినే ఎత్తిపోతల కాల్వలు, ఇతర అవసరాలకు విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 106 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 738 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,289 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.841 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

రామన్‌పాడులో1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,050 క్యూసెక్కులు కుడి, ఎడమ, కాల్వ ద్వారా 65 క్యూసెక్కులు, రాజీవ్ భీమా-2 ద్వారా 855 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 854.2 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 854.2 అడుగుల వద్ద 89.7132 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 4,625, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,843, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భకేంద్రంలో 2.062 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 3,948 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. శ్రీశైలం జలాశయంలో 335 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

అవార్డు కోసం.. ఆపసోపాలు

- దారి తప్పిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే
- మున్సిపాలిటీలో చేయాల్సింది పోయి పల్లెల్లో, బస్టాండ్‌లలోనూ సర్వే
- లక్ష్యం చేరేందుకు తంటాలు





జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

జడ్చర్ల: కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కించుకోవడం కోసం మున్సిపల్ అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. అవార్డు ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సిబ్బందిని ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు.

పోటీ స్ఫూర్తిని పెంచేందుకు..

పట్టణాలు, నగరాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించడంలో భాగంగా మున్సిపాలిటీలలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి సర్వే యాప్‌లో నమోదు చేసి ఉత్తమ మున్సిపాలిటీలను ఎంపిక చేసి స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డును కేంద్రం ప్రకటించనుంది. ఎలాంటి మౌలిక సదుపాయాలు తదితర సౌకర్యాలు లేకున్నా అవార్డు దక్కించుకోవడానికి ప్రజల నుంచి బలవంతంగా అభిప్రాయాలను నమోదు చేసే ఈ సర్వే వివాదాస్పదంగా మారింది. ఎవరికి వారు నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే అవార్డులను దక్కించుకునేందుకు పోటాపోటీగా సర్వేలు చేపట్టి తమ సొంత అభిప్రాయాలను జోడిస్తున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా సర్వేను చేపడుతున్నారు. మహిళా సంఘాల సిబ్బందిని సైతం వినియోగిస్తున్నారు.

యాప్‌లో ఓటీపీతో ఎంటర్..

ఈ సర్వేకు పలు అంశాలతో రూపొందించిన యాప్‌లో ప్రజల అభిప్రాయాలను జోడించాల్సి ఉంది. ప్రతి రోజు ఇంటింటికీ చెత్త సేకరణ బండి వస్తుందా? తాగు నీరు, డ్రెయినేజీల నిర్వహణ, అంతర్గత రోడ్లు, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ, వీధుల శుభ్రత, ఇతర సేవల అంశాలకు సంబంధించి సంతృప్తి, అసంతృప్తిపై ఇంటి యజమాని చెప్పిన విధంగా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇందుకు ఇంటి యజమాని మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ తప్పనిసరి చెప్పాల్సిందే. సర్వే సిబ్బంది ఇవన్నీ చెప్పకుండానే నేరుగా ఓటీపీని అడిగి అంతా సంతృప్తికరంగానే ఉన్నట్లు నమోదు చేస్తున్నారు. విషయం తెలిసిన కొందరు సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ సర్వే పారదర్శకతకు పాతర వేసి కేవలం అవార్డులు దక్కించుకోవడానికి అంతా సవ్యంగానే ఉందంటూ ప్రజల అభిప్రాయంగా పొందుపరుస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

గడువు పూర్తి కావడంతో..

సర్వేను వాస్తవంగా మున్సిపాలిటీ పరిధిలోనే పూర్తి చేయాల్సి ఉంది. మంగళవారం మున్సిపల్ అధికారులు సర్వే సిబ్బంది ఒక్కొక్కరికి 200 టార్గెట్ విధించారు. ఇప్పటికే పట్టణంలో దాదాపు 45వేల మందిని సర్వే చేసి ఉండడం, ఎవరిని అడిగినా ఇప్పటికే ఒకసారి తమ ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ చెప్పి సర్వేలో నమోదు కాబడి ఉండడంతో విధిలేని సిబ్బంది బస్టాండ్‌లు, చుట్టుముట్టు మున్సిపాలిటీ పరిధిలోకి రాని మాచారం, గంగాపూర్, అల్వాన్‌పల్లి, ఇతర గ్రామాలకు సర్వే సిబ్బందిని పంపించారు.

అవాక్కయిన ప్రయాణికులు..

పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో టీ, టిఫిన్, భోజనం, టాయ్‌లెట్స్ వినియోగం కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రయాణికులకు సైతం సర్వే సిబ్బంది వదలక పోవడం గమనార్హం. తమకు లక్ష్యం పెట్టారని ఎలాగైనా ఓటీపీ చెప్పండని బతిమాలడడంతో కొందరు ఓటీపీ చెప్పారు. మరికొందరు తమకేందుకంటూ దాటవేశారు.

మున్సిపాలిటీలో సమస్యలు తీవ్రం..

పారదర్శకంగా చేయాల్సిన సర్వేను కేవలం అవార్డు దక్కించుకోవడమే లక్ష్యంగా చేయడం సరికాదని పట్టణ వాసులు తప్పుపడుతున్నారు. వాస్తవంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. రోడ్లపైనే మురుగు ప్రవహిస్తున్న కాలనీలు అనేకం. తాగునీటి లీకేజీలు, బురద మయంగా మారిన అంతర్గత రహదారులు, విచ్చలవిడిగా పందుల సంచారం, ఇతర కారణాలుగా పరిసరాల పరిశుభ్రత లోపాలు ఉన్నాయని పట్టణవాసులు తెలుపుతున్నారు.

వేగవంతం చేశాం..



స్వచ్ఛసర్వేక్షణ్ సర్వే గడువు బుధవారంతో ముగియనుండడంతో సర్వేను వేగవంతం చేశాం. మున్సిపాలిటీ పరిధిలోనే సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించాం. ఇతర గ్రామాలు, బస్టాండ్‌లో సర్వే చేసినట్లు తమ దృష్టికి రాలేదు. అలా చేయడం సరికాదు. పారదర్శకంగా సర్వే నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

పట్టపగలే చోరీ

తెలకపల్లి: మండల కేంద్రంలోని రెండు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ సతీష్ కథనం మేరకు.. పట్టణంలో ఉండే ఉపాధ్యాయుడు మల్లేష్, ఆయన బావమరిది నాగరాజు ఆదివారం రెండు ఇళ్లకు తాళం వేసి నాయనోనిపల్లి మైసమ్మ ఆలయానికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఓ వ్యక్తి కారులో వచ్చి గోడదూకి తలుపులు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. మల్లేష్ ఇంట్లో రెండు బంగారు ఉంగరాలు, మాట్నీలు, 1.50 తులాల ఆభరణంతో పాటు రూ.10 వేలు.. నాగరాజు ఇంట్లో రూ.15 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేశామని.. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ధన్వాడలో..

ధన్వాడ: వరుస దొంగతనాలతో పట్టణవాసులు భయాందోళనకు గురవుతున్నారు. రెండ్రోజుల కిందట రెండు ఇళ్లలో చోరీ జరగగా.. తాజాగా సోమవారం రాత్రి మరో ఇంట్లో దొంగలు పడ్డారు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని కుర్వవీధిలో ఉండే చెందిన పోలపోళ్ల రాములు భార్య పెద్దపొర్లలో ఉండే అన్నకు రాఖీ కట్టేందుకు సోమవారం వెళ్లింది. మంగళవారం తిరిగి ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరుచుకొని కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందరగా పడి ఉండటంతో పాటు బీరువా తెరుచుకొని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించారు. బీరువాలో ఉన్న 2.50 తులాల బంగారం, 60 తులాల వెండితో పాటు రూ.6 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాజేందర్, ఎస్ఐ రమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మన్యంకొండకు 'శ్రావణశోభ'

- కొనసాగుతున్న హోమం
- స్వర్ణాభరణ అలంకరణలో దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి
- వీరభద్రస్వామికి అఖండ దీపారాధన



మన్యంకొండలో వీరభద్రస్వామికి హారతి ఇస్తున్న దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాస వేడుకలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం దేవస్థానంలో శ్రావణ మాసంలో నెలరోజుల పాటు పలు పూజా కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ ప్రత్యేక హోమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే శ్రావణమాసం సందర్భంగా ఈ నెల 17 నుంచి పలు పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే స్వామివారిని బంగారు ఆభరణాలతో స్వర్ణాభరణ అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే దేవస్థానంలోని హనుమద్దాసుల మండపంలో ప్రతిరోజూ హోమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు వేద పండితులు పాల్గొంటున్నారు. శ్రావణమాసం సందర్భంగా స్వామివారి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మన్యంకొండకు తరలి వస్తున్నారు.

వీరభద్రస్వామికి అఖండ దీపారాధన..

మన్యంకొండ దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి అఖండ దీపారాధన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. దాదాపు 41 రోజుల పాటు ఈ అఖండ దీపారాధన మహోత్సవాలు కొనసాగుతాయి. ఇందులో భాగంగానే స్వామివారి సన్నిధిలో ప్రతిరోజూ పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వంద అడుగుల విస్తీర్ణంతో స్వాగత తోరణం



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల దర్శనార్థం వచ్చే భక్తులకు ఇకపై దేవస్థానం పేరిట అందమైన ఆర్చిగేటు స్వాగతం పలకనుంది. 100 అడుగుల విస్తీర్ణంతో ఆర్చిగేటు నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత దేవాదాయశాఖ అసిస్టెంట్ స్థపతి సంజయ్, ఏఈ బాలయ్య, దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్ ఈ మేరకు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఆర్చిగేటు నిర్మాణం కోసం దేవస్థానం నిధులు ఖర్చుపెట్టేందుకు దేవాదాయశాఖ ఇటీవల అనుమతులు కూడా ఇచ్చింది. కాగా ఇటీవల 60 ఫీట్ల వెడల్పుతో ఆర్చిగేటు నిర్మాణానికి అనుమతులు ఇవ్వగా.. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధి ఇక్కడి ప్రాధాన్యత, రోడ్ల విస్తరణ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని వెడల్పును 60 ఫీట్ల నుంచి 100 ఫీట్లకు పెంపొందించేందుకు గాను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అసిస్టెంట్ స్థపతి, మరియు ఏఈలు పరిశీలించారు. అదే విధంగా జమ్మిచేడు జములమ్మ దేవస్థానం వద్ద కూడా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు, ప్లానింగ్ తదితర అంశాల్లో జములమ్మ ఆలయాన్ని సందర్శించారు.

నేటి నుంచి నరసింహస్వామి శతమాన ఉత్సవాలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని పళ్ల శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో కొలువుదీరిన షోడశబహు లక్ష్మీనరసింహస్వామి శతమాన ఉత్సవాలు బుధవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అనునిత్యం ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పండితుల ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజన సంకీర్తనలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు కోడ్లీ అక్షోభ్యతీర్థ మఠాధిపతులు, అథవాని రఘుప్రేమ తీర్థులతచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షోడశ బహులక్ష్మి నరసింహ స్వామి వంద సంవత్సరాల వేడుకల సందర్భంగా ఆనందశయనస్వామి దేవాయలం నుంచి పూర్ణకుంభంతో పురవీధుల గుండా రాఘవేంద్ర స్వామి ఆలయం వరకు ర్యాలీ ధ్వజారోహణ గోపూజ, ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.